సాక్షి నంద్యాల

సోమవారం । 6 । అక్టోబర్ । 2025



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: దేవస్థానం నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణ పథకానికి ఆదివారం విశాఖప ట్నంకు చెందిన బి.మహాలక్ష్మి రూ.1,01,116 విరా ళాన్ని పర్యవేక్షకులు అయ్యన్నకు అందజేశారు.



శాస్త్రోక్తంగా పల్లకోత్సవం

శ్రీశైలం టెంపుల్: శ్రీభ్రామరీ సమేత మల్లికార్జున స్వామికి ఆదివారం శాస్త్రోక్తంగా పల్లకోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి షోడశోపచార పూజలు చేపట్టారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,626.06
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 14,467
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 13,955

న్యూస్‌రీల్

శ్రీగిరికి పోటెత్తిన భక్తులు



క్యూలైన్లలో వేచివున్న భక్తులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో వెలసిన శ్రీ భ్రమ రాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనా నికి భక్తులు పోటెత్తారు. ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీగిరి చేరుకుని స్వామి అమ్మవార్లను దర్శించుకు న్నారు. వేకువజామున పాతాళగంగలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనా నికి క్యూలైన్లలో బారులుదీరారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూలైన్లు నిండి పోయాయి. భక్తుల శివ నామ స్మరణతో శ్రీశైల ఆలయం మారుమోగింది.

వైద్యుల సమస్యలను పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

గోస్పాడు: వైద్యుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అంకిరెడ్డి అన్నారు. పీహెచ్‌సీల వైద్యులు డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమాన్ని చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అంకిరెడ్డి మాట్లాడుతూ.. పీహెచ్‌సీ వైద్యుల సమస్యలను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎంతో కాలంగా గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి ఒకే క్యాడర్‌లో పని చేస్తున్న సంబంధిత వైద్యులకు ఎలాంటి ప్రమోషన్లకు నోచుకోగా అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. ఇన్ సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరించాలని, టైమ్ బౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి బేసిక్ పే 50 శాతం ట్రైబల్ అలవెన్స్, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని కోరారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా వినతుల స్వీకరణ

నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఈనెల 29న సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకోవడం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100ను సంప్రదించవచ్చన్నారు. అలాగే అర్జీదారులు దరఖాస్తుల ప్రస్తుత సమాచారాన్ని meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో, టోల్ ఫ్రీ నెంబర్ 1100ను సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

ప్రశాంతంగా ఏపీపీ రాత పరీక్షలు

కర్నూలు (టౌన్): పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) రాత పరీక్షలు ప్రశాంత వాతవరణంలో జరిగాయి. నగరంలోని జి. పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలలో 42 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షలకు కర్నూలులో 261 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తనిఖీ చేశారు. ఎస్పీ వెంట ఏఎస్పీ హుస్సేన్ పీరా, కర్నూలు తాలూకా సీఐ తేజమూర్తి ఉన్నారు.

- జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు
- యువకులే లక్ష్యంగా సరఫరా చేస్తున్న విక్రేతలు
- వైజాగ్ నుంచి రైళ్లలో నంద్యాలకు సరఫరా?
- రైల్వేస్టేషన్‌లో తూతూ మంత్రంగా తనిఖీలు



గంజాయ్.. గుప్పుమంటోంది!

నంద్యాల: గంజాయి వినియోగం, విక్రయాలు జిల్లాలో రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. పట్టణాలు, పల్లెలు తేడా లేకుండా గంజాయి లభిస్తుందంటే విక్రేతలు ఏ స్థాయిలో ఉన్నారో అర్థమవుతోంది. విక్రయాలు, వినియోగాన్ని అడ్డుకోవాల్సిన పోలీసులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. యువత మత్తుకు బానిసలుగా మారుతూ జీవితాలను ఆగమాగం చేసుకుంటున్నా అధికారుల చర్యలు కేవలం ప్రకటనలకే పరిమితవుతున్నాయి. స్మగ్లర్లు వైజాగ్ నుంచి గంజాయిని నంద్యాలకు సరఫరా చేస్తున్నారు. ప్రధానంగా రైలు మార్గంగా ఎంచుకున్నారు. నంద్యాల రైల్వేస్టేషన్‌లో ఎక్కువగా తనీఖీలు లేకపోవడం, పోలీసులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటంతో అనువుగా మార్చుకున్నారు. వైజాగ్ నుంచే కాకుండా ఒడిశా, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల నుంచి నంద్యాలకు తరలించి విక్రయిస్తున్నారు. ఇటీవల పట్టుబడిన నిందితులు పోలీసుల విచారణలో ఒప్పుకున్నట్లు తెలిసింది. అక్కడ కిలో రూ.10 వేల చొప్పున కొనుగోలు చేస్తున్న విక్రేతలు జిల్లాలో వాటిని 5 గ్రాములు ప్యాకెట్లుగా చేసి ఒక్కో ప్యాకెట్ రూ.500 చొప్పున విక్రయిస్తున్నారు. గంజాయికి బానిసైన యువతలో కొందరు విక్రేతలుగా మారుతుండటం ఆందోళన కలిగించే విషయం.ం. గంజాయి దందా వెనకున్న బడా వ్యాపారులపై పోలీసులు దృష్టిపెట్టడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గంజాయి ఎక్కడి నుంచి సరఫరా అవుతుంది? రవాణాకు సహకరిస్తున్నది ఎవరన్నది గుర్తించడంలో పోలీసులు విఫలమవుతున్నారు. దందా వెనక ఉన్న బడా వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోకుండా పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచి చేతులు దులుపు కుంటున్నారు. దీంతో జిల్లాలో గంజాయి విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.



నందికొట్కూరులో గంజాయి విక్రేతలను అరెస్ట్ చేసిన పోలీసులు (ఫైల్)

ఇటీవల జిల్లాలో..

- గత నె ల 21వ తేదీన నందికొట్కూరు పట్టణంలోని మిడుతూరు రహదారిలో ఆత్మకూరు పట్టణానికి చెందిన రాజు, శేషాద్రిలు పింజరి మహబూబ్‌బాషా, మూర్తుజావలి, షేక్‌షోహిల్‌లకు గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 1100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరు తెలంగాణా, ఒడిశా రాష్ట్రాల సరిహద్దుల నుంచి ఆత్మకూరుకు గంజాయి తీసుకొని వచ్చి అమ్ముతున్నట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు.

యువతే టార్గెట్..

గంజాయి ముఠా తన నెట్‌వర్క్ పెంచుకునేందుకు కమీషన్ల ఆశచూపి అమాయకులను ఈ దందాలోకి లాగుతోంది. ముఖ్యంగా గంజాయి రవాణాకు ముఠాలోని సభ్యులు ప్రధానంగా కళాశాల విద్యార్థులను ఇందుకు ఎంపిక చేసుకుంటున్నారు. రహస్యంగా గంజాయి తీసుకొస్తే కమీషన్ ముట్టజెబుతున్నట్లు సమాచారం. జిల్లాలోని ఆళ్లగడ్డ, నంద్యాల, పాణ్యం, నందికొట్కూరు, డోన్, శ్రీశైలం, బనగానపల్లె నియోజకవర్గాల్లో ఈ ముఠా గంజాయి దందా నడుపుతోంది. నంద్యాల జిల్లా కేంద్రంలో రెండు మెడికల్ కళాశాలలు, మూడు ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, జూనియర్ కళాశాలలు ఉన్నాయి. గంజాయి ముఠా సభ్యులు కొందరు నంద్యాలలో చామకాల్వ, చర్చి సెంటర్, బస్టాండ్, బొమ్మలసత్రం, రైల్వే స్టేషన్, నూనెపల్లె ప్రాంతాల్లో అమ్మకాలకు పాల్పడుతున్నారు. మూడు నెలల క్రితం జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్యాలయ వెనుక భాగంలో గంజాయి ప్యాకెట్లు అమ్ముతూ నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాల్సిన యువత గంజాయి మత్తులో చిత్తవుతుంది. సరదాగా మొదలవుతున్న గంజాయి అలవాటు వ్యసనంగా మారడంతో వారి జీవితాలు నాశనమవుతున్నాయి.

- గత నెల 22వ తేదీన డోన్ పట్టణంలోని ఇందిరానగర్‌లో కొందరు యువకులు గంజాయి మత్తులో వీరంగం సృష్టించారు. పట్టపగలే ఒకరిపై ఒకరుదాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో ఒకరు గాయపడ్డారు. గాయపడిన యువకుడు ఆసుపత్రికి వెళ్లగా అక్కడికి కూడా గంజాయి మత్తులో యువకులు వెళ్లి వాగ్వాదానికి దిగడంతో పాటు సామగ్రి ధ్వంసం చేశారు. కాలనీ వాసుల సమాచారం మేరకు పోలీసులు వచ్చినా వారి ముందే కేకలు వేస్తూ దాడులకు పాల్పడ్డారు. పోలీసులు అదుపు చేసే ప్రయత్నం చేసినా యువకులు గంజాయి మత్తులో వారిని లెక్క చేయలేదు.
- జూలై నెల 25వ తేదీన నంద్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వెనుక భాగాన నిర్మానుష్య ప్రాంతంలో గంజాయి వ్యాపారులు ప్యాకెట్లుగా విక్రయిస్తుండగా నంద్యాల పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో వెంకటచిరు, షాహినూర్‌బాషా, దుర్గాప్రసాద్‌లతో పాటు మరో మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 2.5 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో 9 మంది పట్టుబడగా నలుగురు మాత్రమే పోలీసులు అరెస్ట్ చూపించారు. కొనుగోలుదారులను మాత్రమే అరెస్ట్ చూపించారని, భారీగా డబ్బులు చేతులు మారడంతో విక్రయించడానికి వచ్చిన బడా వ్యక్తులను నంద్యాల టూటౌన్ పోలీసులు వదిలేసినట్లు పలు ఆరోపణలు వచ్చాయి.

విక్రయాలను అడ్డుకోవాలి



గంజాయి, డ్రగ్స్ రవాణా, విక్రయాలను అధికారులు అడ్డుకోవాలి. నంద్యాలలో ఇంజినీరింగ్, మెడికల్, డిగ్రీ, బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్‌లో చదువుకోడానికి పలు జిల్లాల నుంచి యువత వస్తోంది. యువకులనే కేంద్రంగా చేసుకొని గంజాయి వ్యాపారులు గంజాయిని పట్టణంలో అమ్ముతున్నారు. పోలీసులు విస్తృత దాడులు చేసి ముఠా ఆట కట్టించాలి

– రాజానాయుడు, ఆర్‌పీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, నంద్యాల

అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం



పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులు మత్తు పదార్థాలతో కలిగే నష్టాలపై యువతకు అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలం అయ్యారు. తూతూ మంత్రంగా కాకుండా ప్రధాన కూడళ్లు, కళాశాలలు, పాఠశాలల వద్ద అవగాహన కలిగేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి. పోలీసులు కాలేజీలు, గ్రామ శివారులు, నిర్మానుష్య ప్రాంతాలో నిఘా ఉంచాలి. తల్లిదండ్రులు తమ పిల్లలపైనే నిఘా ఉంచి పక్కదారి పట్టకుండా బాధ్యతగా ఉండాలి. మత్తు పదార్థాలపై విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు అవగాహన సదస్సులు కల్పించాలి.

– నాగరాముడు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి, నంద్యాల

శ్రీశైలం డ్యాం గేట్ల మూసివేత



శ్రీశైలండ్యాం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం తగ్గడంతో ఆదివారం సాయంత్రం డ్యాం రేడియల్ క్రస్ట్ గేట్లను మూసివేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ మాసంలో జలాశయానికి భారీగా వరద ప్రవా హం చేరడంతో 10 రేడియల్ క్రస్ట్‌గేట్లను 26 అడుగుల మేర తెరచి దిగువకు నీటిని విడుదల చేశారు. గత కొద్దిరోజుల నుంచి వరద తగ్గుముఖం పడుతుండడంతో క్రమేపి గేట్ల ఎత్తును, సంఖ్యను తగ్గించుకుంటూ వచ్చారు. శనివారం నుంచి ఆదివారం వరకు జలాశయానికి 3,19,207 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేర గా దిగువ ప్రాంతాలకు 3,13,478 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. స్పిల్‌వే ద్వారా 2,35,088 క్యూసెక్కు లు, విద్యుత్ ఉత్పత్తి అనంతరం 70,555 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 5,000 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 2,835 క్యూసెక్కుల నీటిని వదిలా రు. కుడిగట్టు కేంద్రంలో 15.450 మిలియన్ యూ నిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 16.955 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఆదివారం సాయంత్రానికి జలాశయంలో 210.9946 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

జాడలేని బట్టమేక పక్షి

- వాతావరణంలో మార్పులే కారణమా ?



నందికొట్కూరు: ప్రతి ఏడాది సెప్టెంబర్ నెలలో అరుదైన బట్టమేక పక్షి.. రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి కొన్ని నెలల పాటు ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఆ పక్షులు ఇక్కడే గుడ్లు పెడుతుంటాయి. అయితే ఈ ఏడాది ఇంత వరకు అభయారణ్యంలో బట్టమేక పక్షుల జాడ కనిపించలేదని అధికారులు చెబుతున్నారు. వీటితో పాటు సుమారు 80 నుంచి 100 పక్షి జాతులు ఇక్కడికి వస్తుంటాయి. కొల్లేరు ప్రాంతంలో అరుదుగా కనిపించే ఫ్లవింగ్ బర్డ్స్ కూడా ఇక్కడికి వస్తాయి. ఈ ఏడాది అధిక వర్షాలు కురవడం, వాతావరణంలో మార్పులు రావడంతో కొన్ని పక్షులు సమయానికి రాలేదని తెలుస్తోంది. అందువల్లే బట్టమేక పక్షి కూడా రావడానికి ఆలస్యం అయ్యి ఉంటుందన్నారు. పక్షి జాతులపై అధ్యయనం చేయడానికి చెన్నై, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి శాస్త్రవేత్తలు, జంతు ప్రేమికులు ప్రతి శని, ఆదివారాల్లో వస్తుంటారు. వచ్చిన వారికి వసతి కోసం రెండు గదులు ఉన్నాయి. మరిన్ని వసతులు కల్పిస్తే పక్షులను, జింకలను చూసేందుకు జంతు ప్రేమికులు, పాఠశాలల విద్యార్థులు వచ్చే అవకాశం ఉంది. పక్షులను చూసేందుకు అభయారణ్యంలోకి వెళ్లాలంటే తప్పని సరిగ్గా ఉన్నతాధికారుల అనుమతులు ఉండాలని అధికారులు తెలిపారు.

శాస్త్రోక్తంగా శేర్తి పూజ



ప్రత్యేక అలంకరణలో మూలవిరాట్ శ్రీ మాలోల లక్ష్మీనరసింహస్వామి

ఆళ్లగడ్డ: నవనారసింహులు కొలువైన ప్రసిద్ధ వైష్ణవ పుణ్యక్షేత్రం అహోబిలంలోని నల్లమల అటవీ ప్రాతంలో కొలువైన శ్రీ మాలోల లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో ఆదివారం శేర్తి పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అహోబిలం మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపారు. నిత్య పూజలు అనంతరం గద్య త్రయం విన్నవించారు. అనంతరం నిత్యం ఆరాధించే ఉత్సవమూర్తి స్వర్ణ మాలోల నరసింహ స్వామిని మూలమూర్తితో ఉంచి ప్రత్యేక శేర్తి పూజలు నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా ఆరాధించారు. అనంతరం శాత్తుమురై గోష్టి కార్యక్రమాలతో పూజలు ముగించారు. ఈ పూజలు ప్రధానార్చకులు కీడాంబి వేణుగోపాలన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.



పీఠాధిపతికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

రైతుల అభ్యున్నతికి కృషి చేయాలి



సంచికను విడుదల చేస్తున్న మాజీ ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా తదితరులు

నంద్యాల(వ్యవసాయం): రైతుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా అన్నారు. ఆదివారం నంది రైతు సమాఖ్య రజతోత్సవ కార్యక్రమాన్ని రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. నంది రైతు సమాఖ్య ముఖ్య సలహాదారులు డాక్టర్ రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మాట్లాడుతూ.. రైతు సంఘాల కృషితో గోరుకల్లు రిజర్వాయర్ నిర్మాణం సాధ్యమైందని, అలాగే గిట్టుబాటు ధరల కోసం సమాఖ్య కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సిద్దేశ్వరం అలుగు నిర్మాణం ఆవశ్యకతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ 25 సంవత్సరాల పాటు నంది రైతు సమాఖ్య రైతు సంక్షేమానికి, ప్రత్యేకించి గ్రామీణ ప్రాంత రైతుల అభ్యున్నతికి కృషి చేసిందన్నారు. ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మాట్లాడుతూ.. రైతులకు సరసమైన ధరలతో నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందించడానికి ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేలా రైతు సమాఖ్య మరింత కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా నంది రైతు సమాఖ్య 25 ఏళ్ల ప్రత్యేక వార్షిక సంచికను అతిథులు, రైతులు, రైతు నాయకులు ఆవిష్కరించారు. అనంతరం వ్యవసాయ రంగంలో విశేష కృషి చేస్తున్న మహిళా రైతులు పద్మావతమ్మ, గోవిందమ్మను సత్కరించారు. సమాఖ్య నూతన అధ్యక్షునిగా బీవీ రామసుబ్బారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రైతు సమాఖ్య ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, కోఆర్డినేటర్ ఓబుళపతి, రైతు నాయకులు డాక్టర్ హయాగ్రీవచారి, రామసుబ్బారెడ్డి, శివరామకృష్ణారెడ్డి, శివారెడ్డి, అనుపూరు రామ సుబ్బారెడ్డి, రఫీ, హరినాథ్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఆదినారాయణరెడ్డి, డీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో మొరాయిస్తున్న వైద్య పరికరాలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో వైద్య పరికరాలు మొరాయిస్తున్నాయి. ఈ విభాగంలోని ఎండోస్కోపి, కొలనోస్కోపి, ఈఆర్‌సీపీ, ఈవీఎల్ వంటి మిషన్లను పది నుంచి 20 ఏళ్ల క్రితం కొనుగోలు చేశారు. అప్పటి నుంచి వీటితో ప్రతి నెలా వెయ్యి మందికి పైగా రోగులకు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఏటా వేలాది మందికి వీటి ద్వారా సేవలు అందుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల కంటే వంద రెట్లతో ఇవి పనిచేసి ప్రస్తుతం మొరాయిస్తున్నాయి. ప్రతి నెలా ఎండోస్కోపి 650 నుంచి 700 వరకు, ఈఆర్‌సీపీ 40 నుంచి 50, ఈవీఎస్ 25 నుంచి 30, కొలనోస్కోపి 65 నుంచి 70 వరకు ఇలా 15కు పైగా వైద్యపరీక్షలు, చికిత్సలు ఈ పరికరాలతో వైద్యులు నిర్వహిస్తున్నారు. నిత్యం ఇవి మొరాయిస్తుండటంతో పరీక్షలు, చికిత్సలు చేసేందుకు వైద్యులు ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని ఆసుపత్రి అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా స్పందన కరువైందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పేదరోగులను దృష్టిలో ఉంచుకుని అధికారులు నూతన వైద్య పరికరాలు సమకూర్చాల్సిన అవసరం ఉంది.

'గంపెడు' నష్టాలు!

ఉమ్మడి జిల్లాలో దాదాపు 13,500 ఎకరాల్లో టమాట సాగయింది. ఈ–క్రాప్ బుకింగ్ ప్రకారం కర్నూలు జిల్లాలో ఇప్పటి వరకు 3,990 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 3,312 ఎకరాల్లో సాగయింది. ఈ–క్రాప్ బుకింగ్ ఇంకా కొనసాగుతుండటంతో టమాట సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. ఉద్యాన శాఖ అధికారుల అంచనాల ప్రకారం ఎకరాకు 15 టన్నుల ప్రకారం దిగుబడి వస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన టమాట నుంచి దాదాపు 2 లక్షల టన్నులు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ప్రతి రోజు 300 టన్నుల టమాట మార్కెట్‌కు వస్తోంది.

- భారీగా నష్టపోతున్న టమాట రైతులు
- ఉమ్మడి జిల్లాలో 13,500 ఎకరాల్లో సాగు
- ధర పడిపోయినా స్పందించని సర్కారు
- రూ.8లకు కొనాలనే సీఎం ఆదేశాలు బేఖాతరు
- అనువుగాని చోట టమాట ప్రాసెసింగ్ యూనిట్



పత్తికొండ మార్కెట్‌కు వెల్లువెత్తిన టమాట

కర్నూలు(అగ్రికల్చర్): నిన్న మొన్నటి వరకు ఉల్లి రైతుల కన్నీరు.. ఇప్పుడు టమాట రైతుల వేదన.. కూటమి ప్రభుత్వం రైతన్నల జీవితాలను రోడ్డు పడేస్తోంది. ఆరుగాలం కష్టించినా గిట్టుబాటు ధరలేక రైతులు దిగాలు చెందుతున్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాలకు, క్షేత్రస్థాయిలో చర్యలకు పొంతన లేకపోవడంతో రైతు నష్టాలను మూటకట్టుకుంటున్నాడు. టమాట కిలో ధర కనీసం రూ.8లకు తగ్గకుండా కొనుగోలు చేయాల్సి ఉన్నా.. ప్రస్తుతం రూ.2 కూడా దక్కని పరిస్థితి. 20 కిలోల టమాటకు లభిస్తున్న ధర రూ.50 మాత్రమే. టమాటకు మార్కెట్‌లో లభిస్తున్న ధరతో అమ్ముకుంటే కోత, రవాణా చార్జీలు, కమీషన్‌కే సరిపోవడం లేదని రైతులు వాపోతున్నారు. కర్నూలు జిల్లాలో పత్తికొండ, ఆస్పరి మండలం బిల్లేకల్, కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు, కర్నూలు మండలం గార్గేయపురంలో టమాట క్రయవిక్రయాలు సాగుతున్నాయి. నంద్యాల జిల్లాలో ప్యాపిలి, డోన్ మండలం చింతలపేట టమాట క్రయవిక్రయాలు చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో ఆస్పరి, పత్తికొండ, పెద్దకడుబూరు, దేవనకొండ, క్రిష్ణగిరి, హాలహర్వి, హొళగుంద, వెల్దుర్తి, ఓర్వకల్, సీ.బెళగల్, గూడూరు మండలాలు, నంద్యాల జిల్లాలో ప్రధానంగా ప్యాపిలి, డోన్, బేతంచెర్ల మండలాల్లో సాగవుతోంది.

సీఎం ఆదేశాలు బేఖాతరు

రైతులు తెచ్చిన టమాటను హోల్‌సేల్‌గా కిలో రూ.8 కంటే తక్కువకు కొనరాదని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశించారు. ఈ ఆదేశాలు ఎక్కడా అమలుకు నోచుకోని పరిస్థితి. 25 కిలోల బాక్స్‌ను రూ.50 నుంచి రూ.80 ధరతో కొనుగోలు చేస్తున్నారు. అంటే కిలో ధర రూ.2 నుంచి రూ.3 వరకు మాత్రమే పలుకుతోంది. రెండు, మూడు రోజులుగా టమాట ధర మరింత దయనీయంగా మారింది. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ధరలు పడిపోయినప్పుడు మార్కెటింగ్ శాఖ అధికారులు కిలో రూ.8కి తక్కువ లేకుండా కొనుగోలు చేశారు. ఇందుకు అనుగుణంగా వ్యాపారులు ధరలు పెంచారు. నేడు ఈ పరిస్థితి లేకపోవడం పట్ల రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

20 కిలోల టమాట ధర రూ.50



ఈ చిత్రంలోని రైతు పేరు లింగన్న. పత్తికొండ మండలం చిన్నహుల్తి గ్రామానికి చెందిన టమాట రైతు. శుక్రవారం మార్కెట్‌కు 30 గంపల టమాట తెచ్చారు. ఒక్కో గంప 20 కిలోలు ఉంటుంది. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం కనీస ధర రూ.8 ప్రకారం కొంటే గంపకు రూ.160 లభిస్తుంది. అయితే పత్తికొండ మార్కెట్‌లో 20కిలోల గంపకు లభించిన ధర రూ.50 మాత్రమే. అంటే కిలో టమాటకు లభించిన ధర రూ.2 మాత్రమే. ఒక ఎకరాలో టమాట సాగు చేశారు. పెట్టుబడి రూ.60 వేల వరకు వచ్చింది. కొద్ది రోజులుగా మార్కెట్‌కు టమాట తీసుకొస్తున్నా ఒక్క రోజు కూడా రూ.8 ధర లభించలేదు. టమాట పంటకు కూడా ఎకరాకు రూ.20 వేల ప్రకారం పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

అనువుకాని చోట టమాట ప్రాసెసింగ్ యూనిట్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమీకృత టమాట ప్రాసెసింగ్ యూనిట్‌కు అనువైన భూమిని కేటాయించింది. హోసూరు రోడ్డులోని 3.60 ఎకరాల్లో రూ.12.05 కోట్లతో టమాట ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటుకు సిద్ధమైంది. గత ఏడాది మే నెలాఖరు వరకు పనులు కూడా చురుగ్గా కొనసాగాయి. 2024 ఎన్నికల్లో కూటమి గెలిచి ప్రభుత్వం ఏర్పాటైంది. ఊహించినట్లుగానే టీడీపీ నేతలు తమ స్వార్థంలో భాగంగా ప్రాసెసింగ్ యూనిట్‌ను మరో చోటుకు మార్పు చేశారు. పత్తికొండ మండలం కనకదిన్నె సమీపంలో 2.50 ఎకరాల్లో ఏర్పాటు చేయతలపెట్టారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన ఆర్‌కేవీవై నిధులు రూ.11 కోట్లతో యూనిట్‌కు ఈ ఏడాది మార్చి 14న పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్ భూమి పూజ చేశారు. ఆరు నెలలు గడుస్తున్నా పనుల్లో ఎలాంటి పురోగతి లేకపోవడం గమనార్హం.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య

ఆదోని అర్బన్: ఎస్కేడీ కాలనీకి చెందిన రాజ్ కిరణ్(38) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మీసేవ కేంద్రంలో పని చేస్తున్న ఇతనికి కొన్నేళ్లుగా మానసిక స్థితి సరిగా లేదు. తల్లిదండ్రులు శివశంకర్ రావు, గంగాబాయి గతంలోనే మృతిచెందారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందాడు. బంధువులు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో ఇంటికి వచ్చి తలుపులు తట్టినా తీయకపోవడంతో.. పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా మృతి చెంది కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

కర్నూలు (టౌన్): పరస్పరం గొడవ పడిన ఘటనలో ఇరువురు వ్యక్తులపై ఆదివారం ఒకటి, రెండవ పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. రెండు రోజుల క్రితం వడ్డగేరికి చెందిన కర్నూలు మార్కెట్ యార్డుకు చెందిన డైరెక్టర్ చిన్నమ్మ కుమారుడు నాగార్జున డీవీఆర్ హోటల్ సమీపంలో అదే ఏరియాకు చెందిన నరేష్ అనే వ్యక్తితో గొడవ పడ్డారు. ఈ ఘటనలో బాధితుడి తలకు గాయాలయ్యాయి. దీంతో బాధితుడి బంధువులు ఆదివారం వడ్డెగేరిలో ఉన్న నాగార్జునపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఇరువురు ఆయా పోలీసు స్టేషన్ పరిధిలో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వెటర్నరీ డిపార్ట్‌లో అటెండర్‌గా పనిచేసున్న నక్కలమిట్టకు చెందిన లక్ష్మన్న ఎమ్మిగనూరు నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా ఆదోని నుంచి వస్తున్న కారు ఢీ కొట్టింది. గాయపడ్డ లక్ష్మన్నను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

దేవరగట్టు.. భక్తిపారవశ్యం

- దేవరగట్టులో ఇనుప గొలుసు తెంపిన గొరవయ్య
- నేడు నెరణికి చేరనున్న ఉత్సవ విగ్రహాలు



ఇనుప గొలుసును తెంపుతున్న గొరువయ్య



చాటీలతో కొట్టుకుంటున్న గురు గొరవయ్యలు

హొళగుంద: వందలాది మంది గొరవయ్యల ఢమరుక నాదాలతో దేవరగట్టు ఆదివారం హోరెత్తింది. భక్తిపారవశ్యం వెల్లివిరిసింది. శ్రీమాళ మల్లేశ్వర స్వామి సన్నిధానంలో ఆదివారం గొరవయ్యల నృత్యాలు అలరించాయి. గొలుసు తెంపుట ఆకట్టుకుంది. జైత్రయాత్ర అనంతరం సింహాసన కట్ట మీద కొలువుదీరిన మాళమల్లేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాల ఎదుట దేవదాసిల క్రీడత్సవం, వసంతోత్సవం, కంకణ విసర్జన తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా సాగాయి.

దైవ వచనాలు వల్లెవేస్తూ..

జిల్లా నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భారీ సంఖ్యలో గొరవయ్యలు దేవరగట్టుకు తరలివచ్చారు. శ్రీమాళ మల్లేశ్వరస్వామి మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. అనంతరం మల్లప్ప గుడిలోని సింహాసన కట్ట మీదున్న స్వామి వారి ఉత్సవమూర్తుల ఎదుట పిల్లనిగ్రోవి ఊదుతూ, త్రిశూలం చేతబట్టి, ఢమరుకాలను ఆడిస్తూ లయబద్ధంగా నృత్యం చేశారు. గురు గొరవయ్యలు చాటిలతో కొట్టుకుంటూ ఉద్వేగంగా వచనాలు చెప్తూ పూనకంతో ఊగిపోయారు. కొందరుదైవ వచనాలు వల్లెవేస్తూ అందుకు తగ్గట్టు హావభావాలు ప్రదర్శిస్తూ నృత్యం చేశారు.

నాలుగు జరికలకు తెగిన గొలుసు

ఉత్సవంలో భాగంగా ఇనుప గొలుసును హాలహర్వి మండలం బల్లూరు గ్రామానికి చెందిన గొరవయ్య గాదిలింగప్ప నాలుగు జరికలకు తెంపాడు. ఉత్సవ మూర్తులు కొలువుదీరిన మల్లప్ప గుడి ఎదుట ప్రతి ఏటా ఇనుప గొలుసు తెంపడం ఆనవాయితీగా వస్తుంది. ఈ ఏడాది ఆదివారం దాదాపు 20 కేజీల బరువు ఉన్న గొలుసును నాలుగు జరికలకు తెంపారు. దీంతో భక్తులు గొరవయ్యను భుజాల మీదెత్తుకుని ఈలలు, కేకలు వేస్తూ ఆనందంతో నృత్యాలు చేశారు. గతేడాది 51 జరికలకు గొలుసు తెగితే ఈ ఏడాది నాలుగు జరికలకే తెగడం పట్ల భక్తులు సంతోషంతో ఎగిరి గంతులు వేశారు.

వసంతోత్సవం.. కంకణ విసర్జన

ఆదోని, ఆలూరు, గుంతకల్లు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన బసివినిలు క్రీడోత్సవం చేశారు. అనంతరం రంగు నీళ్లను భక్తులపై చల్లి వసంతోత్సవం, కంకణ విసర్జన కార్యక్రమాలను నిర్వహించారు. మాళమల్లేశ్వర విగ్రహాలతో పాటు పల్లకీని భక్తులు ఊరేగింపుతో కొండ పైనున్న ఆలయానికి తీసుకెళ్లారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో హొళగుంద, హాలహర్వి, చిప్పగిరి, ఆలూరు మండలాల ఎస్‌ఐలు దిలీప్‌కుమార్, శ్రీనివాసులు, మారుతి తదితరులతో పాటు పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

నేటితో ముగియనున్న ఉత్సవాలు

దేవరగట్టులో ఉన్న శ్రీమాళ మల్లేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను సోమవారం గొరవయ్యలు కాలినడకన నెరణికి గ్రామానికి మోసుకెళ్తారు. ఉత్సవ విగ్రహాలను గ్రామ ఊరు వాకిలి వద్ద ఉన్న ఆంజనేయ స్వామి వద్ద కొలువుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అక్కడ నుంచి ఊరేగింపు నిర్వహించి యథాస్థానానికి చేర్చడంతో ఉత్సవాలు ముగుస్తాయి.



ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న దృశ్యం



ప్రసాదానికి పూజలు చేస్తున్న గొరవయ్యలు



క్రీడోత్సవం

శాశ్వత పరిష్కారంపై దృష్టి

అవుకు(కొలిమిగుండ్ల): అవుకు రిజర్వాయర్‌కు సంబంధించిన రివిట్‌మెంట్‌కు శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించామని మంత్రి బీసీ జనార్దనరెడ్డి అన్నారు. ఆదివారం ఎస్సార్బీసీ ఈఈ శుభకుమార్, డీఈ కిరణ్‌కుమార్, జేఈ సుధాకర్‌తో కలిసి రెండు రోజుల క్రితం కుంగిన రివిట్‌మెంట్‌తో పాటు కట్ట కింద లీకేజీ అవుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. రిజర్వాయర్‌కు రివిట్‌మెంట్ నిర్మించి 16 ఏళ్లు అవుతుందన్నారు. గత ఏడాది కుంగిన ప్రదేశంలోనే మళ్లీ కుంగిందన్నారు. లోపం ఎక్కడుందో నిపుణుల ద్వారా తెలుసుకుంటామని చెప్పారు. గతంలో ఒక మీటర్ వరకు ఉన్న లీకేజీ ఇప్పుడు మూడు మీటర్లకు పెరిగిందన్నారు. గత నివేదిక ఆధారంగా జిల్లా కలెక్టర్‌తో చర్చించి డీఎంఎఫ్ నుంచి రూ.కోటి రూపాయలు నిధులు మంజూరు చేశామని ఇందులో రూ.65 లక్షలకు టెండర్లు పూర్తయ్యాయని అన్నారు. ఈలోగా రెండో సారి కుంగడం జరిగిందన్నారు. రివిట్‌మెంట్ కుంగిన ఘటనకు సంబంధించి అధికారులను అడిగి వివరాలు సేకరించారు. ఇరిగేషన్ మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రిజర్వాయర్‌కు ఎలాంటి ముప్పు లేదన్నారు.

యువకుడి ఆత్మహత్య



జస్వంత్(ఫైల్)

తుగ్గలి: సూపర్ వాస్మాల్ తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జొన్నగిరి ఎస్‌ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఉప్పర్లపల్లికి చెందిన యలమంచి జస్వంత్(25) మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పదేళ్లుగా వైద్యం చేయిస్తున్నా తగ్గలేదు. ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తాడో తెలియని పరిస్థితి. ఈ క్రమంలో శనివారం గుత్తికి వెళ్లిన జస్వంత్ అక్కడే రసాయన ద్రావణాన్ని తాగి ఇంటికి వచ్చాడు. వాంతులు చేసుకుని స్పృహ తప్పి పడిపోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుత్తికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో అదే రోజు రాత్రి మృతి చెందాడు. జస్వంత్ తండ్రి చంద్రశేఖర్ ఏడేళ్ల క్రితం మృతి చెందారు. మృతుడి తల్లి దివ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆదివారం ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తిపై గొడ్డలితో దాడి

- స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు
- బాధితుడి పరిస్థితి విషమం



ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు సుభాన్

నంద్యాల: పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని గాంధీనగర్ వద్ద పట్టపగలే వ్యక్తిపై గొడ్డలితో దాడి చేసిన సంఘటన కలకలం రేపింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గాంధీనగర్ జంక్షన్‌లోని ఓ దుకాణం వద్ద గట్టాల్ నగర్‌కు చెందిన సుభాన్ అనే వ్యక్తి కూర్చొని ఉండగా గాంధీ నగర్‌కు చెందిన పరుశురాముడు గొడ్డలితో తలపై రెండు సార్లు నరికాడు. దీంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయిన సుభాన్ చనిపోయాడనుకొని పరుశురాముడు నంద్యాల త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. తీవ్రంగా గాయపడిన సుభాన్‌ను పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి పరిస్థితి విషమంగా ఉంది. వీరిద్దరి మధ్య వినాయక చవితి పండుగ సందర్భంగా డ్యాన్స్ విషయంలో ఘర్షణ చోటు చేసుకుందని, పాత కక్షలతోనే హత్యాయత్నం జరిగిందని పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నెహ్రూనగర్‌లో ఘర్షణ

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో శనివారం దుర్గామాత అమ్మవారి నిమజ్జన వేడుకల్లో ఘర్షణ చోటుచేసుకుంది. దసరా నవరాత్రి మహోత్సవాల సందర్భంగా గ్రామంలో నెలకొల్పిన అమ్మవారి విగ్రహానికి గ్రామస్తులు నిమజ్జన వేడుకలకు ఉపక్రమించారు. ఈ క్రమంలో విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఊరేగింపుగా తరలిస్తు చేస్తున్న డ్యాన్స్ విషయంలో ఓ సామాజిక వర్గానికి చెందిన గంగన్న, గణేష్, మద్దిలేటి, గిరిరాహుల్, మరో సామాజిక వర్గానికి చెందిన మధు, మహేష్, వంశీ, అనిల్, ప్రభాస్‌ల మధ్య వివాదం తలెత్తింది. శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో నిమజ్జనం చేసేందుకు విగ్రహాలను మూర్వకొండ ఘాట్‌కు తరలించారు. అమ్మవారిని బ్యాక్‌వాటర్‌లో నిమజ్జనం చేసిన అనంతరం స్నానాలు చేస్తుండగా మధు, మహేష్, వంశీ, అనిల్, ప్రభాస్‌లు మూకుమ్మడిగా గంగన్న, గణేష్‌లపై పడి నీటిలో ముంచి హత్య చేసేందుకు ప్రయత్నించారని బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు మిడుతూరు ఎస్‌ఐ ఓబులేసు నిందితులను స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టారు.

కొనసాగుతున్న నీటి విడుదల

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి 5వేల క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. శ్రీశైలం జలాశయంలోకి వరద కొనసాగుతుండగా సాయంత్రం ఆరుగంటల సమయంలో పోతిరెడ్డిపాడు వద్ద 883.20 అడుగుల నీటిమట్టం నమోదయ్యిందన్నారు. హెడ్‌రెగ్యులేటర్ 4వ గేటు నుంచి 1,500 క్యూసెక్కులు, ఎస్సీఎల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి 3,500 క్యూసెక్కుల నీటిని ఎస్సార్ఎమ్సీలోకి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని బానకచర నుంచి తెలుగుగంగ 4 వేల క్యూసెక్కులు, ఎస్సార్బీసీ (జీఎన్ఎస్ఎస్)కాల్వకు 500, కేసీ ఎస్కేప్ కాల్వకు 500 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు బానకచర్ల ఏఈ దేవేంద్ర తెలిపారు.

ఆస్తి విషయంలో తల్లి, అక్కలపై దాడి



తీవ్రగాయాల పాలైన లక్ష్మి, మాధవ లక్షమ్మ

బేతంచెర్ల: ఆస్తి విషయంలో తల్లి, అక్కపై ఓ వ్యక్తి తన భార్య, అత్త, బావమరిదితో కలసి కత్తులతో దాడి చేసిన సంఘటన ఆర్. కొత్తపల్లె గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చిన్న రామ మద్దయ్య, సుభద్రమ్మ దంపతులకు గ్రామంలో రెండెకరాల పొలం ఉంది. వీరికి ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. అప్పులు ఉండటంతో పొలం అమ్మాలని దంపతులు కొడుకు, కుమార్తెలతో చర్చిస్తున్నారు. ఈ క్రమంలో పొలం అమ్మ కూడదని కొడుకు శేఖర్, భార్య శ్యామల, బావమరిది నీలకంఠం మధు, అత్త పుల్లమ్మతో కలసి తల్లిదండ్రులతో గొడవ పెట్టుకున్నారు. ఆ క్రమంలో అక్కలు లక్ష్మి, మాధవ లక్షమ్మ, సుజాత, రమాదేవిపై తమ్ముడు శేఖర్, బంధువులతో కత్తులతో దాడి చేసి గాయపరిచారు. ఈ ఘర్షణలో తీవ్రగాయాలపాలైన లక్ష్మి, మాధవ లక్షమ్మను బేతంచెర్ల ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆసుపత్రికి చేరుకుని వివరాల సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు శేఖర్, నీలకంఠం, పుల్లమ్మ, శ్యామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సు, ట్రాక్టర్ ఢీ

- ఎనిమిది మందికి గాయాలు



ఆర్టీసీ బస్సు-ట్రాక్టర్ ఢీకొన్న సంఘటన

బనగానపల్లె రూరల్: మండలంలోని టంగుటూరు గ్రామ సమీపంలో ఆర్టీసీ బస్సు-ట్రాక్టర్ ఢీకొన్నాయి. ఆదివారం జరిగిన ఈ ఘటనలో ఎనిమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. నందివర్గం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. శిరివెళ్ల మండలం కోటపాడు గ్రామానికి చెందిన చిలకల రమేష్ కుటుంబ సభ్యులు ట్రాక్టర్‌లో కైప గ్రామంలోని బిజ్జి తిమ్మయ్య స్వామికి మొక్కుబడి నిమిత్తం వచ్చారు. కార్యక్రమం అనంతరం తిరిగి స్వగ్రామానికి ట్రాక్టర్‌లో బయల్దేరారు. అయితే టంగుటూరు గ్రామంలోని పెద్దమ్మగుడి సమీపంలో ట్రాక్టర్‌ను వెనుక వైపు నుంచి ఆర్టీసీ బస్సు ప్రమాదశాత్తు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్ బోల్తాపడి అందులో ప్రయాణిస్తున్న రమేష్ బంధువులు పుల్లయ్య, లక్ష్మీదేవి, మాధురి, లింగమ్మ, తిమ్మయ్య, కాశమ్మ, అబ్దుల్‌రహీం, దస్తగిరిలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను 108 ద్వారా నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



జ్ఞాపకాల జడివాన

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

బనగానపల్లె రూరల్: ఇల్లూరుకొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం జ్ఞాపకాల జడివాన కురిసింది. 21 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ఆనాటి జ్ఞాపకాలను పంచుకుంటూ పరవశించిపోయారు. 2003-2004 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమం ఆర్గనైజర్లు మహబూబ్‌బాషా, ఇస్మాయిల్, షరీఫ్, ఓబులేసు, విజయ్, చంద్రుడు, షఫీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పలువురు ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ దూర ప్రాంతంలో ఉన్న ఈ కార్యక్రమానికి హాజరై మిత్రులను, చదువు చెప్పిన గురువులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులు రంగారెడ్డి, దాదాబాషా, సురేష్‌బాబు, పద్మావతి, వెంకటలక్ష్మీ, సుబ్బరాయుడు నారాయణ, రమేష్‌ను సన్మానించి వారి ఆశీర్వాదాన్ని తీసుకున్నారు. కార్యక్రమంలో 70 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అధికార పార్టీ నేతల అండదండలతో దౌర్జన్యం

ప్యాపిలి: అధికార పార్టీ నాయకుల అండ ఉందంటూ తనపై బెలం పుల్లారెడ్డితో పాటు మరి కొందరు దౌర్జన్యం చేస్తున్నారని హుసేనాపురం గ్రామానికి చెందిన నల్లబోలు ప్రేమకుమారి ఆదివారం విలేకరుల ముందు వాపోయింది. హుసేనాపురం గ్రామంలోని 574-2 సర్వే నంబర్‌లో తనకు 3.10 ఎకరాల పొలం ఉన్నట్లు ఆమె తెలిపింది. తన పొలానికి తూర్పు దిక్కున 573 సర్వే నంబర్‌లో బెలం పుల్లారెడ్డి భూమి ఉందన్నారు. బెలం పుల్లారెడ్డికి పొలానికి వెళ్లేందుకు మినహాయింపు రస్తా ఉన్నప్పటికీ దౌర్జన్యంగా తన పొలం మీదుగా రస్తా ఏర్పాటు చేసుకున్నాడని తెలిపింది. తన పొలానికి హద్దుగా ఏర్పాటు చేసుకున్న గోడను కూడా ధ్వంసం చేసి ఎద్దులబండితో పొలంలోకి వెళ్లాడని తెలిపారు. ఇదేమని అడిగితే బెలం పుల్లారెడ్డితో పాటు అతని తనయుడు బెలం సురేంద్రరెడ్డి మరో ఇద్దరు గవల శ్యామదాసు, బోయ రంగడు కలసి తనపై దౌర్జన్యానికి పాల్పడ్డారని తెలిపింది. తమకు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయని బెదిరింపులకు గురి చేస్తున్నారని వాపోయారు. తమకు సంబంధించిన 40 సెంట్ల స్థలాన్ని కబ్జా చేశారని తెలిపింది. ఈ విషయమై రెవెన్యూ, పోలీసు అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేశానని, స్పందించి న్యాయం చేయాలని ఆమె కోరారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి జలక్రీడలు

- సీనియర్స్, మిక్స్‌డ్ విభాగాల్లో కర్నూలుకు పతకాలు



సీనియర్ బాయ్స్ విభాగంలో మొదటి స్థానం సాధించిన ఏలూరు జిల్లా జట్టు



జూనియర్స్ బాయ్స్ విభాగంలో రెండో స్థానం సాధించిన కర్నూలు జిల్లా జట్టు

కర్నూలు (టౌన్): మండలంలోని గార్గేయపురం చెరువులో రెండు రోజులు పాటు జరిగిన 4 వ రాష్ట్ర స్థాయి కెనోయింగ్‌అండ్ కయాకింగ్ డ్రాగన్ బోట్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. అనంతరం నిర్వహించిన విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమానికి ఏపీఈ డబ్ల్యూ డీసీ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర, రాష్ట్ర కెనోయింగ్ అండ్ కయాకింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బలరాం నాయుడు అతిథులుగా హాజరై మాట్లాడారు. స్పోర్ట్స్ కోటా 3 శాతం వినియోగించుకొని క్రీడాకారులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. కర్నూలులో మొట్టమొదటి సారిగా రాష్ట్ర స్థాయి వాటర్ స్పోర్ట్స్‌ను విజయవంతంగా నిర్వహించడం శుభ పరిణామమన్నారు. విజేతలకు మెడల్స్, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కెనోయింగ్ అండ్ కయాకింగ్ సంఘం వ్యవస్థాపకులు శివారెడ్డి, ఏపీ డ్రాగన్ బోట్ అసోసియేషన్ కార్యదర్శి అవినాష్ శెట్టి, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు :

జూనియర్స్ విభాగంలో...

200 మీటర్ల పురుషుల జూనియర్ విభాగంలో ఏలూరు (ప్రథమస్థానం), కర్నూలు (ద్వితీయ స్థానం) నంద్యాల (మూడో స్థానం)

సీనియర్స్ విభాగంలో...

కర్నూలు మొదటి స్థానం, ఎన్టీఆర్ జిల్లా ద్వితీయ స్థానం, పశ్చిమ గోదావరి మూడవ స్థానం

మిక్స్‌డ్ విభాగంలో...

ఎన్టీఆర్ జిల్లా మొదటి స్థానం, కర్నూలు రెండవ స్థానం, నంద్యాల తృతీయ స్థానం

500 మీటర్ల పురుషుల జూనియర్స్ విభాగంలో....

ఎన్టీఆర్ జిల్లా ప్రథమ స్థానం, కర్నూలు ద్వితీయ స్థానం, నంద్యాల తృతీయ స్థానం

సీనియర్స్ విభాగంలో ...

ఏలూరు ప్రథమ స్థానం, నంద్యాల ద్వితీయ స్థానం, కర్నూలు మూడో స్థానం

మిక్స్‌డ్ విభాగంలో...

కర్నూలు ప్రథమ స్థానం, కృష్ణ జిల్లా ద్వితీయ స్థానం, నంద్యాల జిల్లా తృతీయ స్థానం దక్కించుకున్నాయి.

స్కార్పియో బోల్తా - ఐదుగురికి గాయాలు

కొలిమిగుండ్ల: పెట్నికోట-నాయినిపల్లె గ్రామాల మధ్యలో ఆదివారం ప్రమాదవశాత్తు స్కార్పియో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అందులో ఉన్న ఐదుగురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గాయపడ్డారు. పెట్నికోట నుంచి కొలిమిగుండ్ల పార్టీ కార్యాలయం వద్దకు వస్తున్న సమయంలో మార్గమధ్యలో వాహనం బోల్తాపడింది. పెట్నికోటకు చెందిన ఆంజనేయులు, కంబగిరి, నాయినిపల్లెకు చెందిన కృష్ణారెడ్డి, కోటపాడుకు చెందిన పెద్దన్నతో పాటు మరొకరికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని బోల్తా పడిన వాహనాన్ని పైకి లేపి అందులో ఉన్న క్షతగాత్రులను బయటకు తీశారు. వారిని 108లో కొలిమిగుండ్ల పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స కోసం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పరామర్శించారు.



ప్రమాద స్థలంలో క్షతగాత్రులను వాహనంలో నుంచి బయటకు తీస్తున్న స్థానికులు